క్లుప్తంగా

ఎమ్మెల్యే పూజలు



జనగామ: పట్టణంలోని 29వార్డు గణేశ్ మండపంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం పూజలు చేశారు. వేదపండితులు.. ఎమ్మెల్యేను ఆశీర్వదించగా, నిర్వాహకులు శాలువాతో సత్కరించి ప్రసాదం అందించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, కౌన్సిలర్ ముస్త్యాల దయాకర్, గుర్రం నాగరాజు తదితరులు ఉన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

నర్మెట: హాస్టల్‌లో విద్యార్థులకు వడ్డించే భోజనంలో నాణ్యత పాటించాలని ఎంపీడీఓ అరవింద్ చౌదరి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో రికార్డులను గురువారం ఆయన పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థులకు జబ్బులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అందుకే భోజనం చేసేప్పుడు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కందకట్ల శ్రీధర్, బిల్ కలెక్టర్ చిర్రా వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనివేళలు మార్చాలి



స్టేషన్‌ఘన్‌పూర్: గురుకుల పాఠశాలల పనివేళలను మార్చాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలలో గురువారం భోజన విరామ సమయంలో నిరసనలు వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని గురుకుల సొసైటీల్లో ఒకే పనివేళలను నిర్ణయిస్తూ జీఓ 16 విద్యార్థులకు ఒత్తిడి పెంచేవిధంగా ఉందని అన్నారు. తక్షణమే పనివేళలను మార్చాలని డిమాండ్ చేశారు. చంద్రశేఖర్ రావు, శ్రీనివాసరావు, గూడెల్లి కృష్ణ, ఖాదర్‌పాషా, నజ్మాభేగం, మాధవీలత పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



జఫర్‌గఢ్: మహిళలు పొదుపుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని డీపీఎంలు సమ్మక్క, వరలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన స్వర్ణ భారతి మండల సమైఖ్య 14వ మహాసభలో వారు మాట్లాడుతూ.. ఆర్థిక అభివృద్ధికి మహిళా పొదుపు సంఘాలు ఎంతో దోహదం చేస్తాయని, తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా, మహిళా శక్తి పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు రేష్మ, కార్యదర్శి ఎం.రేణుక, ఆర్‌ఎం నిర్మల, రమ్యకృష్ణ, సీసీ నర్సింగం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రఘునాథపల్లి: అక్రమంగా తరలిస్తున్న 39 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రఘునాథపల్లి ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. గురువారం నిడిగొండ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా ట్రాలీలో 39 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుట్లు గుర్తించారు. రేషన్ బియ్యం తరలిస్తున్న సిద్దిపేట జిల్లా జగదేవ్పూర్ మండలం అంతాయగూడేనికి చెందిన చంటి అలియాస్ శివ, నల్ల కనకరాజులను అదుపులోకి తీసుకోగా మండలంలోని ఖిలాషాపూర్, అశ్వరావుపల్లిలో రేషన్ బియ్యం కిలో రూ.15 చొప్పున కొనుగోలు చేసి సిద్దిపేటకు తరలిస్తున్నట్లు తేలిందన్నారు. రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కూనూర్‌లో..

జఫర్‌గఢ్: కూనూర్ గ్రామానికి చెందిన ఇల్లందుల నర్సయ్య ఇంటి వద్ద అక్రమంగా నిల్వచేసిన 22 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. యాదాద్రి జిల్లా తుర్కపల్లికి చెందిన భూక్య దేవేందర్‌తో కలిసి చుట్టుపక్కల గ్రామాల నుంచి పీడీఎస్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ చేసి వాహనాల్లో తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాధ్యులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, తిడుగు గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న 2 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు.

అంగన్‌వాడీల్లో 'పోషణ్ అభియాన్'



నర్మెట: చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ రమాదేవి





జనగామ రూరల్: సత్రం కాలనీలో.. తరిగొప్పుల: వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న రంగమ్మ



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండలో..



కొడకండ్ల: వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న రజనీకాంత్



దేవరుప్పుల: అవగాహన కల్పిస్తున్న హేమలత

నర్మెట: పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని బొమ్మకూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. కేంద్రంలోని కోడిగుడ్లు, ఆహార పదార్థాలు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, ఉమారాణి, ఆయాలు, చిన్నారులు పలువురు పాల్గొన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–1లో సూపర్‌వైజర్ రంగమ్మ ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సుజాత, అంగన్‌వాడీ టీచర్ సంతోష పాల్గొన్నారు.

అన్న ప్రాసన..

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పట్టణంలో..

జనగామ రూరల్: పట్టణంలోని సత్రంకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని తీసుకోవాలి

కొడకండ్ల: గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండొచ్చని ఆర్‌బీఎస్‌కే డాక్టర్ రజినీకాంత్ సూచించారు. గురువారం నర్సింగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపరువైజరు సరళ, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, నిర్మల, గర్భిణీ, బాలింతలు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధికి పౌష్టికాహారం కీలకం

దేవరుప్పుల: కౌమార దశ బాలికల అభివృద్ధికి సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం కీలకమని మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్టు పవిత్ర హేమలత సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోషణ మాసోత్సవాల్లో పౌష్టికాహార ఆవశ్యకతపై బాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ప్రత్యేకాధికారి సుకన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సావిత్రి, శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు భాగ్య, సులోచన, సునిత, శోభ, అంజమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశించినా నిర్లక్ష్యం

- బాధిత రైతు ఆనంద్ ఆవేదన



వివరాలు వెల్లడిస్తున్న రైతు ఆనంద్

జనగామ: జనగామ మండలం చీటకోడూరు ప్రాథమిక సహకార సొసైటీలో 2016 ఫిబ్రవరి 22న తన భార్య కొర్ర జ్యోతి పేరిట రూ.40వేలు రుణం తీసుకున్నట్లు గానుగుపహాడ్ శివారు కొర్రతండాకు చెందిన రైతు ఆనంద్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో మాట్లాడుతూ రెండేళ్లు గడిచిన తర్వాత తీసుకున్న రుణానికి రూ.6వేల వడ్డీ చెల్లించగా రశీదు ఇవ్వలేదని, 2023 మార్చి నాటికి అసలు, వడ్డీ కలుపుకుని రూ.55,080 బాకీ ఉన్నట్లు అధికారులు చూపించినట్లు చెప్పారు. 2023 సెప్టెంబర్ 25వ తేదీ వచ్చే సరికి(6 నెలల వ్యవధి) బాకీ రూ.77,710లకు పెంచి, రూ.22,630 వడ్డీని అదనంగా చూపించారని ఆనంద్ వాపోయాడు. 2023 అక్టోబర్ 10న రూ.33,026 నగదు మాఫీ కాగా.. బ్యాలెన్స్ రూ.44,684 ఉన్నట్లు రికార్డులో చూపించినట్లు పేర్కొన్నారు. తన భార్యతో పాటు వ్యక్తిగతంగా తన పేరిట ఎస్‌బీఐలో పంట రుణం రూ.1.66,874 ఉండగా.. చీటకోడూరు పీఏసీఎస్ అధికారులు రుణం అదనంగా రూ.22,630 ఉన్నట్లు చూపించారని, మొత్తం కలుపుకుని రూ.2,12,080లకు పెరిగిందని వివరించాడు. రికార్డు పరంగా రెండు బ్యాంకుల్లో కలుపుకుని రూ.2లక్షలకు పైగా ఉండడంతో పూర్తిగా రుణం మాఫీ కాలేదని, ఈ విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగా విచారణ కోసం జిల్లా కోఆపరేటివ్ అధికారికి రెఫర్ చేసిన లెటర్ తీసుకెళ్లి చూపిస్తే తమకు తెలియదంటూ తిరిగి పంపిస్తున్నారని, న్యాయం చేయాలని రైతు ఆనంద్ వేడుకున్నారు.

స్వచ్ఛత అందరి బాధ్యత



జనగామ: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మల్లిగారి మధు

జనగామ: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అన్ని వర్గాల ప్రజలు పట్టణ స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని 20వ వార్డు ఆఫీసర్ మల్లిగారి మధు పిలుపునిచ్చారు. గురువారం వార్డులో డ్రెయినేజీలను క్లీన్ చేయించి బ్లీచింగ్ చల్లారు. అలాగే రహదారులపై ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, తడి, పొడిచెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలు వచ్చిన సమయంలో అందించాలని కోరారు. ఆయన వెంట కాలనీ వాసులు ఉన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామాల్లో శ్రమదానం, విద్యార్థులతో మానవహారం, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో..

స్టేషన్ ఘన్‌పూర్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో శ్రమదానం నిర్వహించారు. పొక్లెయినర్‌తో పిచ్చి మొక్కలను తొలగించారు. సంతోష్, నీల రాకేష్, చందర్, భిక్షపతి, సురేష్, ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



స్టేషన్‌ఘన్‌పూర్: పోలీసుల అదుపులో ఉన్న నాయకులు, రైతులు

దేవరుప్పుల: ప్రజాపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం భావస్వేచ్ఛను హరించే విధంగా ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో బేషరతుగా పంట రుణమాఫీ, పంట పెట్టుబడి అందజేయాలని తలపెట్టిన చలో ప్రగతి భవన్ కార్యక్రమం పిలుపు మేరకు రమేశ్‌తోపాటు మండల నాయకుడు ఇంటి వెంకట్‌రెడ్డి తదితరులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రైతులను అరెస్టు చేయడం సరికాదు

స్టేషన్‌ఘన్‌పూర్: పోలీసులు అరెస్టు చేయడం సరికాదని రైతులు ఆరోపించారు. గురువారం పోలీస్ స్టేషన్ ఆవరణలో రైతులు మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు చలో ప్రజా భవన్‌కు పిలుపునివ్వగా వ్యవసయ పనులకు వెళ్తున్న వారిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడం భావ్యం కాదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ అన్నారు. సీపీఎం మండల కార్యదర్శి మునిగల రమేష్, తాటికొండ సురేష్, చల్ల చందర్ రెడ్డి, కనకం గణేష్, ఆగారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు విన్నవిస్తామంటే అరెస్టులా..

చిల్పూరు: రుణమాఫీ విషయంలో సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు చలో ప్రజాభవన్ ముట్టడికి రైతులు పిలుపునిస్తే ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేశ్ అన్నారు. రైతులు హైదరాబాద్‌కు తరలి వెళ్లకుండా బుధవారం అర్ధరాత్రి ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

జఫర్‌గఢ్: రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాని రైతులు చలో ప్రజాభవన్‌కు పిలుపునివ్వగా పలు పార్టీల నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడంపై నిరసన వ్యక్తం చేశారు. వేల్పుల రవి, గోను జైపాల్, చిన్న మైపాల్, సంపతి, కుమార్, రాజు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పండి



జనగామ రూరల్: మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకన్న



రఘునాథపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు



లింగాలఘణపురం: మాట్లాడుతున్న జలేందర్‌రెడ్డి



పాలకుర్తి: పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు



బచ్చన్నపేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లికార్జున్



దేవరుప్పులలో.. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమన్

జనగామ రూరల్/రఘునాథపల్లి/బచ్చన్నపేట/నర్మెట/జఫర్‌గఢ్/లింగాలఘణపురం/పాలకుర్తి/దేవరుప్పుల: గ్రామ పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పాలని పలు మండలాల ఎంపీడీఓలు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయాల్లో వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 21వ తేదీ వరకు తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓలు గార్లపాటి శ్రీనివాసులు, జలేందర్, రాములు, మల్లికార్జున్, అరవింద్ చౌదరి, సుమన్, నాగేశ్వర్లు, మల్లికార్జున్, అరవింద్ చౌదరి, సుమన్, నాగేశ్వర్లు

సంక్షిప్త సమాచారం

108 వాహనాన్ని ఏర్పాటు చేయండి

బచ్చన్నపేట: మండల ప్రజల వైద్య సౌకర్యార్థం అందుబాటులో ఉండేలా 108 వాహనాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు అల్వాల నర్సింగారావు కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి చాలామంది వైద్యం చేయించుకుంటున్నారని, అత్యవసమైతే వారు ఆస్పత్రికి వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండల కేంద్రంలోని ఆస్పత్రిలో 108 వాహనం ఏర్పాటు చేస్తే బాగుంటుందని సంబంధిత అధికారులను కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి జైలు

జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందిన చీపూరి వెంకటేశ్వర్లుకు మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు స్థానిక ఎస్సై రామ్‌చరణ్ గురువారం తెలిపారు. ఆగస్టులో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో వెంకటేశ్వర్లు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో పట్టుపడగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్ గురువారం జిల్లా కోర్టులో వెంకటేశ్వర్లను హాజరుపర్చగా అతడికి జిల్లా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

రేపు హుండీ లెక్కింపు

బచ్చన్నపేట: మండలంలో కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్ధేశ్వరాలయంలో రేపు (శనివారం) హుండీ లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ తెలిపారు. గురువారం ఆలయంలో ఆయన మాట్లాడారు. హుండీ లెక్కింపునకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి పర్యవేక్షణ అధికారిగా వస్తున్నారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. ప్రధాన పూజారి ఓం నమశివాయ, సిబ్బంది లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగం భానుప్రకాష్‌రెడ్డి, బండారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన కందుకూరి పోషవ్వ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. కాగా, గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు ఏదునూరి రవీందర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2వేల సాయంగా అందజేశారు. మోతె గట్టయ్య, వెంకటయ్య, బొల్లు రాజేందర్, రాజు, రజాక్, నరేందర్, శ్రీనివాస్, ప్రభాకర్ ఉన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: మండలం కేంద్రంలోని బుర్రకథ కళాకారుడు తీగల కొమురయ్య, కడవెండిలో కాంగ్రెస్ నాయకుడు ఇల్లెందుల ఎల్లయ్య అకాల మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబాలను పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గురువారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీ జాకీర్, షబ్బీర్, రమేష్, నర్సయ్య, మహేందర్‌జీ, రాంబాబు, సోమనర్సోజీ, మల్లయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం

తరిగొప్పుల: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు పదోన్నతిపై విచ్చేసిన ఉపాధ్యాయులు విద్యార్థులకు గురువారం అతిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం నెల్లుట్ల జానకి అభినందించారు.

సస్పెండ్ చేయాలి

బచ్చన్నపేట: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17న జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పిలిస్తే డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్టేజీ మీద కూర్చుంటే పలువురు అనవసరంగా విమర్శలు చేశారని అన్నారు. అసమ్మతి నేతలు వేముళ్ల సత్యనారాయణ, ఎర్రమల్ల సుధాకర్, మాసంపల్లి లింగాజీలపై హైకమాండ్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సన్మానం

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి అర్జున్, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..



బచ్చన్నపేట: నూతనంగా బాధ్యతలు చేపట్టిన స్థానిక తహసీల్దార్ మహిపాల్‌రెడ్డిని పలు పార్టీల నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే ఇచ్చి సన్మానించారు. నూకల బాల్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, హరికృష్ణ, భాస్కర్, శ్రీనివాస్, మహేందర్, సద్ది సోమిరెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డాక్టర్ జయప్రకాశ్ నేతృత్వంలో సిబ్బందితో వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీతారామయ్య, ఏఎన్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు మాధవరెడ్డి, సంపత్, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌ను విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: ఈ నెల 27, 28 తేదీల్లో కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న బాలబాలికల మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను విజయవంతం చేయాలని నోడల్ అధికారి ఎండీ పర్వేజ్ కోరారు. పోటీల నిర్వహణకు ఆయా పాఠశాలల పీఈటీలతో ఎస్‌జీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు పోటీలను నిర్వహిస్తున్న తెలిపారు. పోటీల్లో విద్యార్థులు పాల్గొని క్రీడా ప్రతిభను చాటాలని కోరారు. కాగా, మండల స్కూల్ గేమ్స్ కన్వీనర్‌గా అకుల సాయికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా హరిత ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

కూలిన స్తూపం పరిశీలన



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో వాహనం ఢీకొని కూలిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు పందిగోటి వెంకటయ్య స్మారక స్తూపాన్ని గురువారం సీపీఎం మండల కార్యదర్శి బొడ్డు కరుణాకర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. స్తూపం కూలేందుకు బాధ్యులైన వారు తిరిగి పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు దేవదానం ఉన్నారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన నాయకులు

దేవరుప్పుల: హైదరాబాద్ గాంధీ భవనలో టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మండలంలోని చౌడూరుకు చెందిన ఎస్సీ సంఘం రాష్ట్ర నాయకులు భాషిపాక సోమయ్య, ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూతాటీ కుమార్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం పార్టీ పరంగా తోడ్పాటు అందించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

సేవకు మించిన భాగ్యం లేదు

- వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న రవిచంద్రన్

జనగామ రూరల్: సమాజంలో సేవకు మించిన భాగ్యం మరొకటి లేదని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్ అన్నారు. గురువారం అంతర్జాతీయ సహృద్భావ పర్యటనలో భాగంగా కోమటిరెడ్డి సుశీలమ్మ వద్ధాశ్రమాన్ని సందర్శించారు. అనంతరం వాసవి, వనితా క్లబ్ ప్రతినిధులు మాదంశెట్టి వరుదిని అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనతి కాలంలోనే గొప్ప కార్యక్రమాలను వాసవీ క్లబ్ చేపట్టడం అభినందనీయమని, భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరారు. క్లబ్ జిల్లా గవర్నర్ సాంబమూర్తి మాట్లాడుతూ.. విద్యాలయాలకు, ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో చీరలు పంపిణీ చేయడంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.లక్ష విలువైన వాటర్ ట్యాంక్, హాస్ వాషింగ్ స్టేషన్ అందజేశారు. రవిచంద్రన్‌ను ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ గవర్నర్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున, గోపయ్య, డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, రవీందర్, శంకర్, అనూజ, భిక్షపతి, మల్లికార్జున్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆరోగ్య మిత్రల సమ్మె

జనగామ: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మెబాట పట్టిన ఔట్ సోర్సింగ్ ఆరోగ్య మిత్ర ఉద్యోగుల నిరసన గురువారం రెండో రోజు కొనసాగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మారెడ్డి ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య మిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని, జీఓ 60 ప్రకారం వేతనం రూ.22,750 ట్రస్ట్ ద్వారా చెల్లించి, కాంట్రాక్టు విధానంలోకి మార్చాలన్నారు. రాబోయే రోజుల్లో పీఆర్‌సీ కనీస వేతనం రూ.35వేలకు పెంచి, టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాంప్రసాద్, కార్యదర్శి కిరణ్‌కుమార్, కోశాధికారి చంద్రమౌళి, సభ్యులు పాల్గొన్నారు.

'బహిరంగ చర్చకు బీఆర్‌ఎస్ సిద్ధం'



మాట్లాడుతున్న సుందర్‌రామిరెడ్డి

దేవరుప్పుల: ఉద్యమాల గడ్డలో బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన సమగ్రాభివృద్ధితోపాటు కాంగ్రెస్ నేతలు పాల్పడుతున్న అక్రమాల తీరుపై నిగ్గు తేల్చేందుకు బహిరంగ చర్చకు బీఆర్‌ఎస్ సిద్ధమని ఆ పార్టీ జిల్లా నాయకుడు పల్లె సుందర్‌రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకుడు బస్వ మల్లేషం ప్రతిసవాల్ విసిరారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో చిన్నమడూరు రియల్టర్ వ్యవహారంలో ఓ కాంగ్రెస్ నాయకుడు కిడ్నాప్‌కు పాల్పడిన విషయమై ఫోన్ సంభాషణ, పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రతులను చూపించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి హోదాలో దయాకర్‌రావు చరిత్రలో ఎరుగని రీతిలో పాలకుర్తి నియోజకవర్గంలో సమగ్రాభివృద్ధిలో సాగు, తాగునీరు, రహదారుల పురోగతి అభివృద్ధి కాంగ్రెస్ నేతలకు కనిపించకపోవడం శోచనీయమన్నారు. ప్రజాతీర్పుతో గెలిచిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి మరో ఇద్దరు తోడై అధికారిక పరిపాలన చేస్తుంటే విడ్డూరంగా ఉందన్నారు. వ్యక్తిగత సహాయకుడిగా చెప్పకునే వ్యక్తి పార్టీ ఫిరాయింపుల కోసం మాజీ సర్పంచ్‌లను బెదిరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ఉన్నమాట అంటే పరువు నష్టం కేసుకు వెళ్తున్న ఆయన మాజీ మంత్రి దయాకర్‌రావు, పార్టీ నాయకుల మనోభావాలకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంసింగ్, మాజీ ఎంపీపీ సోమయ్య, జలంధర్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.